
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 సిద్దిపేట

బుధవారం 21 ఫిబ్రవరి 2024



దూళిమిట్ట మండలం కూటిగల్‌లో అమ్మవారి గద్దెల వద్ద ముస్తాబు

నేడు గద్దె పైకి సారలమ్మ



నంగునూరు మండలం అక్కెనపల్లిలో జాతరకు ముస్తాబైన సమ్మక్క, సారక్క గద్దెలు

సిద్దిపేట జిల్లాలోని సమక్క సారలమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చిన్నజాతరలకు అమ్మల గద్దెలు ముస్తాబయ్యాయి. పలు ప్రాంతాల్లో జాతరలు జరగనుండగా నేడు సారలమ్మ గద్దె పైకి చేరుకోనుంది. మేడారం వెళ్లలేని వారు స్థానికంగానే మొక్కులు తీర్చుకుంటారు. భక్తుల సౌకర్యార్థం ఆయా ఆలయాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించారు. భక్తులు అధికంగా వచ్చే ఆలయాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

వార్తలు 8వ పేజీలో

ఐదోవారం బుకింగ్ ఆదాయం రూ.56.03లక్షలు

చేర్యాల, ఫిబ్రవరి 20: కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోవారాన్ని పురస్కరించుకుని భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ మేరకు రూ.56.03 లక్షల బుకింగ్ ఆదాయం సమకూరినట్లు ఆలయవర్గాలు తెలిపాయి. భక్తులు మొక్కుబడిలో భాగంగా సమర్పించిన తలనీలాలు, అర్జిత సేవలు, పట్నాలు, బోనాలు, ప్రసాద విక్రయాలు, ప్రత్యేక దర్శనాలు, వసతి గదుల అద్దె తదితరాల ద్వారా శనివారం రూ.3,88,620, ఆదివారం రూ.35,93,622, సోమవారం రూ.16,21,088 చొప్పున రూ.56,03,330 ఆదాయం సమకూరింది. గతేడాది జాతరవారంలో మహాశివరాత్రి కలిసి రావడంతో సుమారు రూ.58.12లక్షలు రాగా ఈ ఏడాది రూ.2లక్షల వరకు తగ్గింది. జాతరకు తోడు మేడారం భక్తులు తరలివస్తుండటంతో నాలుగువారాల పాటు బుకింగ్ ఆదాయం రికార్డుస్థాయిలో పెరిగినా ఐదోవారం తగ్గడం గమనార్హం.



మల్లన్న ఆలయ గంగిరేగుచెట్టు ప్రాంగణంలో భక్తజన సందోహం

రూ.9.45 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం

- ఉపాధిహామీ పథకం కింద నిధులు మంజూరు
- మార్చి నెలాఖరులోగా పనులు పూర్తి చేసేలా ప్రణాళిక

సిద్దిపేట అగ్రికల్చర్, ఫిబ్రవరి 20 : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో రూ.9.45 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. సిద్దిపేట నియోజకవర్గ పరిధిలో రూ.కోటితో తొమ్మిది పనులు చేపట్టనున్నారు. దుబ్బాక నియోజకవర్గంలో రూ.2కోట్లతో 21 పనులు, హుస్నాబాద్ నియోజకవర్గంలో రూ.3 కోట్లతో 28 పనులు, మానకొండూర్ నియోజకవర్గ పరిధిలో రూ. 50 లక్షలతో 10 పనులు, గజ్వేల్ నియోజకవర్గంలో రూ.1.80 కోట్లతో 25 పనులు, జనగామ నియోజకవర్గంలో రూ.1.15 కోట్లతో చేపట్టనున్న 23 పనుల ప్రతిపాదనలకు పరిపాలనాపరమైన అనుమతులను మంజూరు చేశారు.

మంజూరైన పనుల వివరాలు

సిద్దిపేట రూరల్ మండలంలో నాలుగు పనులు చేపట్టేందుకు రూ.47లక్షలు, సిద్దిపేట అర్బన్ మండలంలో ఒక పని చేపట్టేందుకు రూ. 13 లక్షలు మంజూరయ్యాయి. నంగునూరు మండలంలో 2 పనులు చేపట్టేందుకు రూ. 20లక్షలు, చిన్న కోడూరు మండలంలో రూ.10లక్షలతో ఒక పని, నారాయణరావుపేట మండలంలో ఒక పనిని చేపట్టేందుకు రూ. 10లక్షలు మంజూరయ్యాయి.

బెజ్జంకి మండలంలో రూ.50లక్షలతో 10 పనులు చేపట్టనున్నారు. హుస్నాబాద్ మండలంలో రూ. కోటితో 9 పనులు, అక్కన్నపేట మండలంలో రూ.కోటితో 9 పనులు, కోహెడ మండలంలో 10 పనులు చేపట్టేందుకు రూ.కోటి మంజూరయ్యాయి.

దుబ్బాక మండలంలో రూ.20లక్షలతో ఒక పని, దౌల్తాబాద్ మండలంలో రూ. 45 లక్షలతో 7 పనులు, రాయపోల్ మండలంలో రూ. 40 లక్షలతో 6 పనులు, తొగుట మండలంలో రూ. 95 లక్షలతో 7 పనులు చేపట్టనున్నారు.

గజ్వేల్ మండలంలో రూ. 30లక్షలతో 6 పనులు, జగదేవ్‌పూర్ మండలంలో రూ.30 లక్షలతో 3 పనులు, కొండపాక మండలంలో రూ.30 లక్షలతో 6 పనులు, వర్గల్ మండలంలో రూ. 30 లక్షలతో 3 పనులు, ములుగు మండలంలో రూ. 30 లక్షలతో 4 పనులు, మర్కుక్ మండలంలో రూ. 30 లక్షలతో 3 పనులు చేపట్టనున్నారు.

చేర్యాల మండలంలో రూ. 35 లక్షలతో 7 పనులు, కొమురవెల్లి మండలంలో రూ.30లక్షలతో 6 పనులు, మద్దూర్ మండలంలో రూ. 25 లక్షలతో 5 పనులు, దూళ్మిట్ట మండలంలో రూ. 25 లక్షలతో 5 పనులు చేపట్టనున్నారు. జిల్లాకు మంజూరైన సీసీ రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణ పనులను మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాల్సి ఉంటుంది.



సీసీ రోడ్లు వేస్తున్న కూలీలు

ట్రావెల్స్ బస్సు బీభత్సం

- అతివేగంగా వచ్చి ఆటో, ట్రాక్టర్‌ను ఢీ
- నలుగురికి గాయాలు

మాసాయిపేట, ఫిబ్రవరి 20: మెదక్ జిల్లా మాసాయిపేట వద్ద 44వ జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ అతివేగంగా నడుపుతూ మాసాయిపేట మండల కేంద్రంలోని బంగారమ్మ ఆలయం వద్ద హైవేపై ట్రాక్టర్, ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను ఢీకొట్టాడు. ప్రమాదంలో ట్రాక్టర్ రెండు ముక్కలవగా ఆటో ధ్వంసమయింది. ఆటో, ట్రాక్టర్‌లో ఉన్న శ్రీనివాస్, భిక్షపతి, ఆశోక్, నర్సమ్మ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు స్పందించి వారిని చికిత్స నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జాతీయ రహదారిపై సుమారు గంటసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. చేగుంట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సహాయంతో ప్రమాదానికి కారణమైన ట్రావెల్స్‌ను బోల్తాపడిన ట్రాక్టర్‌ను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు చేగుంట ఎస్సై బాలరాజు తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

దుబ్బాకలో ఆధిపత్య పోరు!

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే వర్సెస్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి
- నిధుల మంజూరు బాధ్యతలు కాంగ్రెస్ ఇన్‌చార్జికే..
- అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపనలు సైతం
- ప్రొటోకాల్ పాటించడం లేదని బీఆర్ఎస్ ధ్వజం
- ఇరువర్గాల మధ్య అధికారులకు తప్పని తిప్పలు



దుబ్బాక, ఫిబ్రవరి 20 : దుబ్బాకలో మళ్లీ ఆధిపత్య పోరు మొదలైంది. గతంలో బీజేపీ వర్సెస్ బీఆర్ఎస్ మధ్య పోరు కొనసాగగా.. ఈ సారి కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మధ్య వార్ మొదలైంది. గతంలో నియోజకవర్గంలో ఎమ్మెల్యే మినహా ప్రజాప్రతినిధులంతా బీఆర్ఎస్ వారే. ప్రస్తుతం ఎమ్మెల్యే సహా అంతా బీఆర్ఎస్‌లో ఉన్నారు. అయితే, ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థితో ప్రభుత్వ నిధులను మంజూరు చేయించడం రగడకు దారి తీస్తున్నది.

గత అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి 53వేల ఓట్ల పైచిలుకు మెజార్టీతో గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి డిపాజిట్ కూడా లభించలేదు. ఆయన మూడోస్థానానికి పరిమితమయ్యారు. రాష్ట్రంలో అనూహ్యంగా కాంగ్రెస్ అధికారంలోకి రావడం.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఓడినా నిధులు, ఇతర విషయాల్లో వారికే ప్రాధాన్యం ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి దీనిని తనకు అనుకూలంగా మార్చుకున్నారు. అధికారిక వ్యవహారాల్లో ఆయన కలగజేసుకుంటున్నట్లు చెబుతున్నారు. ఇక, ఇటీవల దుబ్బాక నియోజకవర్గంలో బదిలీపై వచ్చిన అధికారులంతా మొదటగా శ్రీనివాస్‌రెడ్డినే మర్యాదపూర్వకంగా కలవడంతో పాటు ఆయనను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించడం గమనార్హం. ఏకంగా ఓ పోలీస్ అధికారి నేరుగా శ్రీనివాస్‌రెడ్డి వద్దకు వెళ్లి పుష్పగుచ్ఛం ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ నిధుల మంజూరు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో ఆయన ప్రభావం చూపడం చర్చనీయాంశంగా మారింది. అక్బర్‌పేట-భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి కూడవెల్లి రామలింగేశ్వరాలయాన్ని గతనెల 26న ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి సందర్శించి జాతర పనులను పర్యవేక్షించారు. ఆయనకు పోటీగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి జాతర పనులను పర్యవేక్షించారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో ఎస్‌ఆర్‌జీఎస్, ఏసీడీఎఫ్ కింద మంజూరైన రూ.10కోట్లను రద్దు చేసి కొత్తగా శ్రీనివాస్‌రెడ్డి ప్రొసిడింగ్‌లను అందజేశారు. తొగుట, చేగుంట, రాయపోల్, నార్సింగ్ మండలాల్లో ఇప్పటికీ సుమారు రూ.4కోట్ల వరకు ఎస్‌ఆర్‌జీఎస్, రూ.2కోట్ల వరకు ఏసీడీఎఫ్ నిధులను మంజూరు చేయించారు. తమ పార్టీ ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపనలు, ప్రొసిడింగ్ కాపీలను అందజేశారు. వీటిపై ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి అసెంబ్లీలో సైతం ప్రస్తావించారు. కాంగ్రెస్ నేతలకు ప్రాధాన్యం ఇచ్చి పాటించడం లేదని ధ్వజమెత్తిన సంగతి తెలిసిందే. దీనిపై బీఆర్ఎస్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు ఆందోళనకు కార్యాచరణను రూపొందించనున్నట్లు ప్రకటించింది.



తొగుట మండలంలో ఎంపీపీతో కలిసి సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

అధికారుల్లో సంశయం

అధికారికంగా ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధుల ప్రొటోకాల్‌ను పాటించాలా? లేక అధికార పార్టీ నాయకుల ప్రొటోకాల్‌ను పాటించాలా? అన్న సంశయం అధికారుల్లో నెలకొన్నది. ఇటీవల రెండు అధికారిక కార్యక్రమంలో ఇదే పరిస్థితి ఎదురైంది. సర్పంచ్ నుంచి ఎంపీపీ, జడ్పీటీసీ, ఎమ్మెల్యే వరకు తామే ప్రజాప్రతినిధులుగా ఉన్నామని, తమను కాదని ప్రొటోకాల్ విస్మరిస్తే ఊరుకోబోమని పలు సందర్భాల్లో అధికారులను హెచ్చరించినట్లు తెలిసింది. ఇరువర్గాల మధ్య ఎవరి ఆదేశాలు పాటించాలో అర్థమవడం లేదని పలువురు అధికారులు వాపోతున్నారు.

అయోమయంలో శ్రావణ్‌కుమార్‌రెడ్డి వర్గం

దుబ్బాకలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆధిపత్యం కొనసాగుతుండడంతో ఆ పార్టీ సీనియర్ నేత పన్యాల శ్రావణ్‌కుమార్‌రెడ్డి వర్గీయుల పరిస్థితి అయోమయంగా మారింది. శ్రీనివాస్‌రెడ్డికి వ్యతిరేకంగా శ్రావణ్‌కుమార్ వర్గీయులు ప్రెస్‌మీట్‌లు పెడుతున్నప్పటికీ వారికి పార్టీలో ప్రాధాన్యత దక్కడం లేదు. ఇక ఓడిపోయిన అభ్యర్థులే అక్కడ ఇన్‌చార్జులని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో శ్రావణ్‌కుమార్‌రెడ్డి వర్గీయులు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి బలవన్మరణం

- అప్పుల బాధతో ఒకరు
- మద్యం మత్తులో మరొకరు
- ఆరోగ్య సమస్యలతో మహిళ



కొండపాకలో మండలంలో అక్రమంగా మట్టిని తరలిస్తుండగా అధికారులు పట్టుకున్న టిప్పర్లు

అక్రమంగా ఇసుక, మట్టి రవాణా చేస్తున్న

వాహనాల పట్టివేత

బాలికల చట్టాలపై విద్యార్థులకు

అవగాహన ఉండాలి

- హుస్నాబాద్ సీఐ ఎర్రల కిరణ్

వార్తలు 8వ పేజీలో

నడ్డి విరుస్తున్న వడ్డీ!

- చిన్న మొత్తంలో అప్పు, అదనంగా వసూళ్లకు పాల్పడుతున్న వ్యాపారులు
- సమయానికి ఇవ్వకపోతే వేధింపులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ!

చిన్నకోడూరు, ఫిబ్రవరి 20 : చిన్నకోడూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు తన షాపు నిర్వహణకు ఓ వడ్డీ వ్యాపారి వద్ద రూ. 30వేలు అప్పుగా తీసుకున్నాడు. తీసుకున్న డబ్బుకు నెల నెలా వడ్డీ కడుతున్నాడు. కానీ అసలు చెల్లించడంలో కాస్త ఆలస్యమైంది. దీంతో సదరు వడ్డీ వ్యాపారి ఆ యువకుడి బైక్‌ను అసలు కింద బైక్‌ను తీసుకెళ్లాడు. ఇక, ఈ విషయం బయటకు తెలిస్తే పరువుపోతుందని సదరు యువకుడు మిన్నకుండిపోయాడు. ఇదొక్కటనే కాదు.. ఇలాంటి సంఘటనలు జిల్లాలో రోజుకు ఏదో ఒకచోట చోటుచేసుకుంటూనే ఉన్నాయి.

ఆపదలో కొందరు.. అవసరాల కోసం మరికొందరు అప్పు తీసుకున్నందుకు అధిక వడ్డీలు చెల్లించలేక సతమతమవుతున్నారు. ఎదుటివారి అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలు వసూలు చేస్తూ వ్యాపారులు జేబులు నింపుకుంటున్నారు. గతంలో పట్టణాలకే పరిమితమైన వడ్డీ వ్యాపారం నేడు పల్లెల్లోనూ విస్తరిస్తున్నది.

పేద, మధ్యతరగతికి చెందిన వారు, చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే వారిని ఎంచుకుని వడ్డీ రాయుళ్లు రెచ్చిపోతున్నారు. పేద, మధ్యతరగతికి చెందిన వారు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారిని ఎంచుకుని వారి అవసరాలను ఆసరాగా చేసుకుని అప్పులు ఇస్తూ అధిక వడ్డీ వసూలు చేస్తున్నారు. రోజు, వారం, నెలవారీగా వసూలు చేస్తున్నారు. సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల వంటి పట్టణాలతో పాటు, మండల కేంద్రాలు, గ్రామాల్లో కూడా వడ్డీ వ్యాపారులు అప్పులు ఇచ్చి రూ.లక్షలు గడిస్తున్నారు. చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేవారు వ్యాపార నిర్వహణ కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇచ్చిన అప్పుకి రెట్టింపు వసూళ్లు చేస్తూ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా అభివృద్ధి చేసుకుంటున్నారు. వ్యక్తుల ఆదాయం, వ్యాపారం, స్థిరాస్తులను బేరీజు వేసుకొని రూ.10 వేల నుంచి లక్ష వరకు అప్పులిస్తుంటారు. ఎలాంటి అనుమతి (రిజిస్ట్రేషన్) లేకుండానే ఫైనాన్స్ పేరిట వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న అమాయకులు వడ్డీ వ్యాపారుల చేతుల్లో చిక్కి మంగిపోతున్నారు.

ఇష్టానుసారంగా వడ్డీ వసూలు

వడ్డీ వ్యాపారులు అప్పు ఇచ్చే మొత్తంలో కొంత మొత్తం (మిత్తి) ముందుగానే తీసుకుంటారు. నిర్ణీత గడువులోగా తీసుకున్న అప్పు చెల్లించకపోతే పెనాల్టీలు వేస్తారని చిరు వ్యాపారులు వాపోతున్నారు. వడ్డీ వ్యాపారులు రూ. 5 నుంచి రూ.10వరకు వడ్డీ వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అధిక వడ్డీతో పాటు, డాక్యుమెంటేషన్ చార్జీలు కూడా రుణగ్రహితల పైనే రుద్దుతున్నారు. ఎదురుప్రశ్నిస్తే అత్యవసర సమయంలో మళ్లీ అప్పు దొరకదేమోనన్న భయంతో కిక్కురుమనడం లేదు. సంబంధిత అధికారులు అక్రమ ఫైనాన్స్ దందాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.



మెదక్ పార్లమెంట్‌లో రఘునందన్ ప్రచారం షురూ



సంగారెడ్డిలో కనిపించిన బీజేపీ ప్రచార రథం

రానున్న పార్లమెంట్ ఎన్నికలలో అభ్యర్థుల ఎంపిక కోసం ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు తలమునకలై ఉన్నాయి. బీజేపీ మాత్రం ఒక అడుగు ముందుకేసి విజయ సంకల్పయాత్ర పేరిట రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల్లో ప్రచార రథాలను ప్రారంభించింది. ఇదే సమయంలో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీకి చెందిన దుబ్బాక మాజీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు పార్టీ సాధించిన విజయ పథకాలతో పాటు ప్రత్యేకంగా తయారు చేయించిన రథాలతో ప్రచారం షురూ చేశారు. అభ్యర్థిగా ఆయనకు పార్టీ ఏమైనా సంకేతాలు ఇచ్చిందో ఏమోగాని 'మన మెదక్-మన రఘున్న' అన్న ఉప శీర్షికతో ప్రచార రథాలు మంగళవారం సంగారెడ్డిలో కనిపించడం ఆ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశం చేశాయి.

-(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి)



వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



కన్నెపల్లి నుంచి జంపన్నను గద్దెపైకి తీసుకొచ్చి ప్రతిష్టిస్తున్న వడ్డెలు



మేడారం దారిలో వాహనాల బారులు..



మంగపేట మండలం కమలాపురం నుంచి ఎడ్లబండ్లపై జాతర కొస్తున్న భక్తులు

జన జాతరకు వేళాయె..

వరంగల్, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడారం జనారణ్యం అవుతోంది. వనదేవతల ఆగమనానికి వేళవుతుండటంతో భక్తులతో మేడారం పోటెత్తుతోంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అద్భు త క్షణాలు బుధవారం సాక్షాత్కరించనున్నాయి. తొలిరోజు సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెకు చేరుకుంటారు. ఈ నేపథ్యంలో మేడారం జనగుడారమవుతోంది. ఎడ్లబండ్లు, కాలినడకన, కార్లు, ఆటోలు, జీపులు, బస్సుల్లో భక్తు లు మేడారం చేరుకుంటున్నారు.

ప్లాస్టిక్ నియంత్రణ ప్రకటనలకే పరిమితం

- బల్దియాలో విచ్చలవిడిగా వినియోగం
- పురపాలక శాఖ ఆదేశాలు బేఖాతర్

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 20: పట్టణాల్లో ప్లాస్టిక్ నియంత్రణ కేవలం ప్రకటనలకే పరిమితమైంది. ప్రజల ఆరోగ్యాలకు ప్రమాదకరంగా మారిన ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని పురపాలక శాఖ ఇచ్చిన ఆదేశాలను ఆశాఖ అధికారులు బేఖాతర్ చేస్తున్నారు. 2022 జూలై 1 నుంచి ప్లాస్టిక్ వినియోగంపై కొత్త నిబంధనలు వచ్చినప్పటికీ, పట్టణాల్లో అమలు జరగడం లేదు. మునిసిపల్ అధికారులు వ్యాపార, వాణిజ్య కేంద్రాలపై దాడులు చేస్తూ నామమాత్రపు జరిమానాలు వేస్తూ చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలొస్తున్నాయి.

నామమాత్రంగా తనిఖీలు

సంగారెడ్డి జిల్లా ఆయా పట్టణాల్లోని దుకాణాలు, వ్యాపార కేంద్రాలు, స్వీట్ షాపులు ప్లాస్టిక్ కవర్లను బహిరంగంగానే విక్రయిస్తున్నాయి. వీటిని అదుపు చేయడంలో పురపాలకశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి. జిల్లాలోని సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, అందోలు-జోగిపేట, సదాశివపేట, అమీన్‌పూర్, బొల్లారం, తెల్లాపూర్ బల్దియాల పరిధిలో ఎక్కువగా పాలిథిన్ కవర్లను వినియోగిస్తున్నారు. అధికారులు మాత్రం అప్పుడప్పుడూ చిన్నచిన్న దుకాణాలపై దాడులుచేసి, జరిమానాలు విధిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. పాలిథిన్‌ను విక్రయించే పెద్ద దుకాణాల వైపు కన్నెత్తి చూడటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2022 జూలై 1 నుంచి నిషేధిత పాలిథిన్ వస్తువుల జాబితాను పురపాలక శాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పట్లో సెప్టెంబరు నుంచి 75 మైక్రాన్లు, డిసెంబరు 31 నుంచి 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్నవాటిపై నిషేధం విధించారు.



జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్‌లో రోడ్డు పక్కన పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు

పురపాలికల్లో రోజువారీగా పాలిథిన్ వినియోగం

సంగారెడ్డి జిల్లాలోని ఆయా మునిసిపాలిటీల్లో పాలిథిన్ వినియోగం రోజురోజుకు పెరిగిపోతున్నది. సంగారెడ్డి గ్రేడ్ వన్ మునిసిపాలిటీ పరిధిలో రోజుకు సరాసరిగా 18 టన్నులు, జహీరాబాద్‌లో 10 టన్నులు, సదాశివపేటలో 16 టన్నులు, అందోలు-జోగిపేటలో 5 టన్నులు, నారాయణఖేడ్‌లో 4 టన్నులు, అమీన్‌పూర్‌లో 14 టన్నులు, తెల్లాపూర్‌లో 6 టన్నులు, బొల్లారంలో 7 టన్నుల పాలిథీన్‌ను వినియోగిస్తున్నట్లు అధికారులు అంచనా వేశారు. పట్టణాల్లో పాలిథిన్ నిషేధంపై పురపాలక శాఖ ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలున్నాయి.

ప్రత్యేక అధికారిని నియమించినా..

ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రతీ మునిసిపాలిటీలో ప్రత్యేకంగా పర్యావరణ ఇంజనీర్‌ను నియమించారు. వీరు పాలిథిన్ కవర్లను వినియోగించవద్దంటూ ప్రజలకు అవగాహన కల్పించాలి. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ అధ్వర్యంలో పట్టణాల్లో, డీఆర్‌డీఏ అధ్వర్యంలో గ్రామాల్లో మహిళా సంఘాలు ఉన్నాయి. పాలిథిన్ కవర్లు వాడకుండా ఉండేందుకు సబ్సిడీపై రుణాలు ఇచ్చి జ్యూట్, వస్త్రం బస్తాలను చేసేలా శిక్షణ ఇస్తే, ఉపాధితోపాటు ఆదాయం పొందే అవకాశం ఉంటుంది. సంగారెడ్డిలో దీనిపై ప్రయత్నాలు చేసినప్పటికీ, నిర్లక్ష్యం కారణంగా అమలుకు నోచుకోవడం లేదు. మునిసిపల్ అధికారులు ప్లాస్టిక్ నియంత్రణపై దృష్టి సారించి, పర్యావరణాన్ని కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రేమించడం లేదని యువకుడి ఆత్మహత్య

తూప్రాన్, ఫిబ్రవరి 20: అమ్మాయి ప్రేమించడం లేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్‌లో చోటు చేసుకున్నది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన ముస్తాకిమ్ కూలీ పనులు చేసేందుకు రెండేళ్ల క్రితం తూప్రాన్‌కు వచ్చి దుర్గం వాడకట్టులో ఉంటున్నాడు. ఏడాది క్రితం ముస్తాకిమ్ బావమరిది ముస్తాక్విన్(18) తూప్రాన్‌కు వచ్చాడు. ఇక్కడే పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ముస్తాక్విన్ ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. కానీ ఆ అమ్మాయి ప్రేమించడం లేదని బావతో చెబుతూ బాధపడేవాడు. మంగళవారం మధ్యాహ్నం భోజనం చేసేందుకు ముస్తాకిమ్, ముస్తాక్విన్, వారితోపాటు ఉండే గాజి అద్దె ఇంటికి వచ్చారు. ఆ సమయంలో ముస్తాక్విన్ బాత్‌రూంకు వెళ్లి వస్తానంటూ చెప్పి చాలా సమయం వరకు రాలేదు. వెళ్లి చూడగా ప్లాస్టిక్ వైరుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. గడియను తొలగించి బయటకు తీశారు. బావ ముస్తాకిమ్ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

కోర్పోలులో కేంద్ర వ్యవసాయాధికారుల బృందం పర్యటన

- సాగు గణాంకాలపై క్షేత్రస్థాయి పరిశీలన

పుల్‌కల్, ఫిబ్రవరి 20: చౌటకూర్ మండలం కోర్పోలు గ్రామంలో కేంద్ర వ్యవసాయాధికారుల బృందం సభ్యులు మంగళవారం పర్యటించారు. ఆర్థిక శాస్త్రం, గణాంకాలు, మూల్యాంకన విభాగం, వ్యవసాయ సహకారశాఖ, రైతుల సంక్షేమ వ్యవసాయం, రైతుల మంత్రిత్వశాఖ కృషి భవన్ న్యూఢిల్లీ అసిస్టెంట్ ఎకానమిక్ అడ్వైజర్ ఆర్‌కే.తప్లియాల్ నేతృత్వంలోని అధికారుల బృందం పర్యటించింది. ఖరీఫ్ సీజన్ మొదలుకుని.. ప్రస్తుతం యాసంగి సీజన్ వరకు పత్తి, వరి తదితర పంటల సాగుకు ఏ మేరకు పెట్టుబడులు అవుతున్నాయో క్షేత్రస్థాయిలో రైతులను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగానే అధికారుల బృందం సభ్యులు గ్రామంలోని పుట్టి వీరయ్య, నారాయణ, ఆర్.లోహిత్‌రెడ్డిలతో పాటు మరికొంతమంది రైతులను కలుసుకుని వారి అనుభవాలను తెలుసుకున్నారు. రైతులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు, వారి మనోగతాలు, పంటల సాగు ఖర్చు లెక్కల వివరాలను కేంద్ర గణాంక శాఖ ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నది. ట్రాక్టర్‌తో దుక్కి దున్నడంతో ప్రారంభమయ్యే వ్యయం ఏ విధంగా ఉన్నాయో వారిని అడిగి తెలుసుకున్నారు. కలుపు తీయడానికి అవసరమయ్యే కూలీల ధరలు ఏ ఏటికాయేడు అమాంతం పెరిగిపోతున్నాయంటూ రైతులు తమ గోడును అధికారుల బృందానికి వినిపించారు. వరి సాగుకు నీరు పారించే సమయంలో ఎక్కువ గంటలు పారిస్తున్నట్లుగా అధికారుల పరిశీలనలో వెల్లడైనట్లుగా గుర్తించారు. పంటల సాగుకు రైతులు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలను సంప్రదించి, సలహాలు తీసుకోవాలంటూ సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అదనపు ఆర్థిక సలహాదారుల ప్రొఫెసర్ శ్రీచేతన్ జయంత్, వ్యవసాయ ఆర్థికశాఖ సీపీఎస్ డైరెక్టర్ డాక్టర్ సుహాసిని, క్షేత్రస్థాయి అధికారి డి.శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ స్టాటిస్టిషీయన్ టీఎం దినేష్, ఏఆర్‌వో రాంచరణ్ తేజ్, ఏఆర్‌వోలు సుమన్, గాయత్రి, ఏఈవో వి.లక్ష్మణ్, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, ఉపసర్పంచ్ చందాపురం ముకుందంముదిరాజ్ పాల్గొన్నారు.



కోర్పోలులో వరి పంటను పరిశీలిస్తున్న కేంద్ర వ్యవసాయశాఖ అధికారులు

కృత్రిమ మేథదే భవిత

- జనరేటివ్ ఏఐ వర్క్‌షాప్‌లోనెక్స్ట్‌వేవ్ గ్రోత్ మేనేజర్ ప్రశాంత్

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 20: భవిష్యత్తు సాంకేతికతలో కృత్రిమ మేథ (ఏఐ) కీలక భూమిక పోషించబోతోందని, విద్యార్థి దశ నుంచే దానిపై పట్టు సాధించాలని నెక్స్ట్ వేవ్ గ్రోత్ మేనేజర్ ప్రశాంత్ ఏఆర్ స్పష్టీకరించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని కోగాన్ (సాంకేతిక మెళకువలను ప్రోత్సహించే విద్యార్థి విభాగం) మంగళవారం నిర్వహించిన ఒక రోజు 'జనరేటివ్ ఏఐ వర్క్‌షాప్'లో ఆయన ప్రధాన వక్త, శిక్షకుడిగా పాల్గొన్నారు. గీతమ్‌లోని స్టూడెంట్ లెఫ్ట్ అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ఏఐఈఎస్ఈసీల సంయుక్త సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యశాలలో వివిధ రంగాల్లో కృత్రిమ మేథ సాధనాలు, వాటి వినియోగంపై సమగ్ర అవగాహన కల్పించేందుకు ప్రయత్నించారు. ఏఐ టూల్స్ ఆచరణాత్మక అభ్యాసం, చాటీపీటీ వంటి వాటిపై ఆయన గీతం విద్యార్థులకు ప్రాథమిక అవగాహన కల్పించారు. వేగవంతమైన వృద్ధి, మంచి సామర్థ్యాన్ని సమకూర్చుకోవడం కోసం కృత్రిమ మేథ సాధనాల వినియోగంపై విద్యార్థిగా ఉన్నప్పటి నుంచే పట్టు సాధించాలని సూచించారు. చాటీపీటీ, సూపర్ చార్జ్ కంటెంట్ క్రియేటర్, పర్‌ప్లెక్సిటీ ఏఐ, డాల్ ఈ2, డ్రీమ్ వార్స్, రన్వే ఎంఎల్, సోరా, క్లిప్ చామ్ వంటి పలు రకాల కృత్రిమ మేథ సాధనాలను విద్యార్థులకు ప్రశాంత్ పరిచయం చేశారు. అలాగే ఫ్రేమర్, హోస్టింగర్ వంటి ఏఐ సాధనాల గురించి వరించారు. ఈ కార్యశాలలో విద్యార్థులు కృత్రిమ మేథ సాంకేతికత, భవిష్యత్తు, వివిధ పరిశ్రమలలో దాని వినియోగం వంటి అంశాలపై లోతైన అవగాహనను ఏర్పరచుకున్నారు. వాటిపై అవగాహన, ఉత్సుకతలను పెంపొందించడానికి ప్రశాంత్ కొన్ని వీడియోలు చూపుతూ, వాటిపై లోతుగా ఆలోచించి, ప్రశ్నలు అడిగేలా విద్యార్థులను ప్రోత్సహించారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ప్రశాంత్

ట్రాక్టర్‌ను ఢీకొని మెడికల్ జూనియర్ అసిస్టెంట్ మృతి



సుజిత్(ఫైల్)

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 20: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని మెడికల్ జూనియర్ అసిస్టెంట్ మృతి చెందిన సంఘటన సోమవారం అర్ధరాత్రి జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. స్థానిక అజయ్‌నగర్ కాలనీకి చెందిన కొడిపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి బైక్‌పై వెళ్తూ, పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. వెంటనే 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని తల్లి కవితా రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

బీజేపీతో పొత్తు అంటూ బీఆర్ఎస్ నాయకుల తప్పుడు ప్రచారం



ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రఘునందన్‌రావు

నర్సాపూర్, ఫిబ్రవరి 20: గత అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని దెబ్బ తిన్న బీఆర్ఎస్‌కు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ప్రజలు బుద్ధి చెబుతారని, ఆ పార్టీ నుంచి నాయకులు చేజారకుండా ఉండేందుకు బీజేపీతో పొత్తు అంటూ ఆ పార్టీ వారే తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రఘునందన్‌రావు పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్‌లో మెదక్ జిల్లా బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి త్వరలో జిల్లాలో పర్యటించనున్న విజయ సంకల్ప యాత్రకు సంబంధించిన కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డానే స్వయంగా బీఆర్ఎస్‌తో పొత్తు ఉండదని స్పష్టం చేసినా.. బీఆర్ఎస్ అనుకూల మీడియాలో కావాలని తప్పుడు ప్రచారం చేయిస్తున్నారన్నారు. ప్రజలు ఈ తప్పుడు ప్రచారాన్ని నమ్మి మోసపోవద్దన్నారు. మూడోసారి కూడా కేంద్రంలో మోదీ ఆధ్వర్యంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

రేణుకా ఎల్లమ్మకు ఘనంగా బోనాలు



వేడుకల్లో బోనంతో జోగిని శ్యామల

గజ్వేల్, ఫిబ్రవరి 20: శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లికి గౌడసంఘం సభ్యులు ఘనంగా బోనాలు సమర్పించారు. గజ్వేల్ పట్టణంలోని పిడిచెడ్ రోడ్డులోని శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి పంచమ వార్షికోత్సవాల సందర్భంగా మంగళవారం అమ్మవారికి సమర్పించే బోనాల ఊరేగింపును అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రధాన పూజారి సంపత్ ఆధ్వర్యంలో మూల విరాట్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివసత్తుల శిగాలు, పోతరాజుల నృత్యాలు, బాజాభజంత్రీల మధ్య జోగిని శ్యామల బోనాన్ని ఎత్తుకుని ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ ఇంటి నుంచి బోనాలను తీసుకువచ్చి, ఒడి బియ్యం సమర్పించారు. అనంతరం రేణుకాఎల్లమ్మ-జగదాగ్ని మహామునిల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి విచ్చేసిన కళాకారుల ప్రత్యేక వేషధారణ, నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమాల్లో గౌడ సంఘం నాయకులు రాజాగౌడ్, గణేశ్‌గౌడ్, అశోక్‌గౌడ్, రమేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌గౌడ్, బలరాంగౌడ్, లింగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గద్దెకు చేరుకోనున్న సారలమ్మ

● ఆయా మండలాల్లో రంగులతో గద్దెలు ముస్తాబు ● 24వరకు ఉత్సవాలు ● మేడారం వెళ్లలేనివారికి స్థానికంగానే మొక్కులు తీర్చుకునే అవకాశం



దూళిమిట్ట మండలం కూటిగల్‌లో భక్తుల సౌకర్యార్థం వేసిన చలువ పందిళ్లు



కొమురవెల్లిలోని సమ్మక్క-సారలమ్మ గద్దెలు



నంగునూరు:అక్కెనపల్లిలో జాతరకు ముస్తాబైన సమ్మక్కసారక్క ఆలయం

మద్దూరు, ఫిబ్రవరి 20 : నేటి నుంచి దూళిమిట్ట మండలంలోని కూటిగల్‌లో జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జాతర కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలోని అమ్మవార్ల గద్దెలకు రంగులు వేసి ముస్తాబు చేశారు. ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు, టెంట్లు వేసి నీడ ఏర్పాటు చేశారు. ఈ నెల 14న కోయ పూజారులచే శక్తిపీఠాలకు ఆకిల్ దావర చేసి నైవేద్యం సమర్పించి అంకురార్పణ చేశారు. అనంతరం డప్పు చప్పుళ్ల, శిసత్తుల పూనకాల మధ్య బోనంతో బయలుదేరి సమ్మక్క సారలమ్మ ఆలయ సమీపంలోని గుడివద్ద శక్తిగుళ్ల ఎదుట నైవేద్యాలు సమర్పించారు. అంతకు ముందు గ్రామదేవతలకు జలాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతర కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. నేడు సారలమ్మ దేవత గద్దెకు రానుందన్నారు. 22న సమ్మక్క గద్దెకు చేరుకుంటుందన్నారు. 23వ వనదేవతలకు మొక్కుల చెల్లింపు, 24న సమ్మక్క, సారలమ్మ వన ప్రవేశం ఉంటుందన్నారు. జాతరకు వచ్చే భక్తులకు అన్ని రూట్లలో ఆర్టీసీ బస్సులు వస్తాయన్నారు.

● **చేర్యాల:** మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరను పురస్కరించుకుని నేటినుండి చేర్యాల, కొ మురవెల్లి మండలాల్లో జాతర కొనసాగనున్నది. చేర్యాలలోని బురాన్‌మియాతోట, గట్టుతోట శివారు కాలనీలతో పాటు రాజీవ్ రహదారి సమీపంలోని కొమురవెల్లి శివారులో అమ్మవార్ల గద్దెలను సంసిద్ధం చేశారు. రంగులు వేసి తీర్చిదిద్దారు.

● **నంగునూరు:** సమ్మక్క, సారలమ్మ జాతరకు నంగునూరు మండలం అక్కెనపల్లి గ్రామం ముస్తాబైంది. మేడారం వెళ్లలేని భక్తులు ఇక్కడ మొక్కులు తీర్చుకునేలా సమ్మక్క, సారక్క గద్దెలను తీర్చిదిద్దారు. మండలంలోని భక్తులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి దర్శించుకుంటారు. జాతరలో భక్తులు మొక్కులను తీర్చుకునేందుకు వారి నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించి ఒడి బియ్యం పోసి ప్రత్యేక పూజలు ఉంటాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం సారలమ్మను గద్దెకు తీసుకురావడం, గురువారం సమ్మక్కను గద్దెకు తీసుకువచ్చే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. శుక్రవారం భక్తులు ముడుపులు చెల్లించుకుంటారు. శనివారం అమ్మవార్లు వన ప్రవేశంతో జాతర ముగుస్తుంది. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ రాత్రి వేళల్లో ఒగ్గు కథ, సాంస్కృతిక కార్యక్రమాలను ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

జాతరకు పోలీసు బందోబస్తు: ఏసీపీ

హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 20: ఈనెల 21 నుండి 24 వరకు జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీష్ పేర్కొన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లో జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర ఏర్పాట్లను సీఐ ఎర్రల కిరణ్‌తో కలిసి పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేపట్టాలని జాతర నిర్వాహకులకు, జాతరకు వచ్చే భక్తులు పోలీసులు ఇచ్చే సలహాలు, సూచలను పాటించాలని సూచించారు.



హుస్నాబాద్‌లో సమ్మక్క గద్దెలను పరిశీలిస్తున్న ఏసీపీ సతీష్

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి బలవన్మరణం

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న ఘటనల్లో ముగ్గురు బలవన్మరణం చెందగా ఆయా కుటుంబాల్లో విషాదం చోటు చేసుకుంది.



కనకరాజ్ (ఫైల్)

తొగుట, ఫిబ్రవరి 20: మండలంలోని కాన్గల్ గ్రామంలో మంగళవారం అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ముత్తోళ్ల కనకరాజ్(27), భార్య కల్పన గ్రామంలో హోటల్ నడుపుకుంటూ జీవిస్తున్నారు. హోటల్ వ్యాపారం సరిగా నడవక అప్పులు అధికమయ్యాయి. అప్పులు తీర్చే మార్గం లేక ఈ నెల 1న రాత్రి హోటల్ వెనుక చెట్టు కింద పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబీకులు వెంటనే అతడిని చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గాంధి ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం కనకరాజ్ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్టు హెడ్‌కానిస్టేబుల్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు.



అబ్దుల్‌పాషా (ఫైల్)

● **రాయపోల్:** దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్‌కు చెందిన అబ్దుల్ పాషా మద్యం మత్తులో ఉరేసుకున్నాడు. బాధిత కుటుంబ సభ్యులు, ఎస్‌ఐ శ్రీరాంప్రేమ్‌దీప్ వివరాల ప్రకారం.. ఇందుప్రియాల్‌కు చెందిన అబ్దుల్‌పాషా కుటుంబం దౌల్తాబాద్‌లో ఉంటున్నది. కొంతకాలంగా అబ్దుల్‌పాషా మద్యానికి బానిసయ్యాడు. తరచూ తాగి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి బాగా మద్యం తాగి ఇంటికి వచ్చాడు. భార్య భయంతో పిల్లలను తీసుకొని వేరేవాళ్ల ఇంట్లో పడుకున్నది. ఈ క్రమంలో అబ్దుల్‌పాషా తన సోదరికి ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. దీంతో ఆమె అబ్దుల్‌పాషా భార్యకు ఫోన్ చేసి చెప్పింది. వెంటనే ఆయన భార్య మరికొందరితో కలిసి ఇంటి తలుపులు పగులగొట్టగా అబ్దుల్‌పాషా చీరతో దూలానికి ఉరేసుకొని మృతి చెంది వేలాడుతూ కనిపించాడు. భార్య అప్షుబేగం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



సక్కుబాయి (ఫైల్)

● **సిద్దిపేట అర్బన్ :** ఆరోగ్య సమస్యలతో సతమతమవుతూ సిద్దిపేట అర్బన్ మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన సక్కుబాయి అనే మహిళ మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. సోమవారం పురుగుల మందు తాగిన మహిళను స్థానికులు గమనించి సిద్దిపేట ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

తాళం పగలగొట్టి చోరీకి యత్నం

కొండపాక, ఫిబ్రవరి 20 : గుర్తు తెలియని దుండగులు తాళం పగలగొట్టి చోరీకి యత్నించిన ఘటన కుకునూర్‌పల్లి మండల కేంద్రం సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది. కుకునూర్ పల్లి ఎస్‌ఐ పి. శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం కుకునూర్‌పల్లి మండల కేంద్రంలో నివాసం ఉంటున్న మహమ్మద్ యూసుఫ్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు బీరువా తాళాలు ధ్వంసం చేసి, చోరీకి యత్నించారు. అయితే విలువైన వస్తులేవీ లభించకపోవడంతో వెళ్లిపోయారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపాడు.

తాళం వేసిన ఇంట్లో దొంగతనం

చేర్యాల, ఫిబ్రవరి 20: మండలంలోని ముస్త్యాల గ్రామంలో ఓ ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లిన కుటుంబ సభ్యులు తిరిగి వచ్చేసరికి దొంగలు ఇల్లు గుల్ల చేశారు. బాధితులు తెలిపిన మేరకు వివరాల ప్రకారం.. ముస్త్యాల గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి సామల రామస్వామి ఈనెల 16న కుటుంబ సమేతంగా షిరిడీ సాయిబాబా దర్శనానికి వెళ్లారు. ఇది గమనించిన ఆగంతకులు ఇంటి తలుపులకు వేసిన తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. బీరువాను ధ్వంసం చేసి అందులోని 5గ్రాముల బంగారు కమ్మలు, బుట్టాలు, 5గ్రాముల ముడి బంగారం చొప్పున మొత్తం 10గ్రాముల బంగారం, 5తులాల వెండి మొలతాడు, 3తులాల వెండి గిన్నెను అపహరించుకుపోయారు. చోరీ జరిగినట్టు గమనించిన స్థానికులు రామస్వామికి సమాచారం అందించడంతో మంగళవారం గ్రామానికి చేరుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ దామోదర్ తెలిపారు.

హబ్షీపూర్ ఏటీఎంలో చోరీకి యత్నం

దుబ్బాక, ఫిబ్రవరి 20: దుబ్బాక మండలం హబ్షీపూర్ గ్రామంలోని ఇండియన్ వన్ ఏటీఎం కేంద్రంలో మంగళవారం తెల్లవారుజామున రెండుగంటలకు చోరీకి యత్నించినట్టు దుబ్బాక ఎస్‌ఐ గంగారాం తెలిపారు. మంగళవారం సిద్దిపేట ఏటీఎం నిర్వాహకులు పరిశీలించి ఏటీఎంలో చోరీకి యత్నించినట్టు నిర్ధారించారు. సీసీ కెమెరాలను పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు చోరీకి యత్నించినట్టు తెలిసింది. దీంతో దుబ్బాక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఆరుగురికి జరిమానా

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 20: ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టిబడిన వాహనదారులను మంగళవారం కోర్టులో హాజరుపరచగా జరిమానా విధించినట్టు సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసులు సిద్దిపేట పట్టణంలో ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో ఆరుగురు మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డారు. వారిని వారిని సిద్దిపేట అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ జడ్జ్ వి. శ్రావణి, ముందు హాజరుపరచగా విచారణ చేసి ఆరుగురికి రూ.9000 జరిమానా విధించినట్టు చెప్పారు.

పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి

చేర్యాల, ఫిబ్రవరి 20 : సిద్దిపేట జిల్లా వ్యవసాయశాఖాధికారి శివప్రసాద్ మంగళ వారం కొమురవెల్లి మండలం పోసాన్‌పల్లి గ్రామంలో పర్యటించి వరి పొలాలు పరిశీలించారు. కాండం తొలిచే పురుగుఉధృతిని పరిశీలించి రైతులకు నివారణ చర్యలు సూచించారు. రెక్కల పురుగుల నియంత్రణకు గట్టు చివరన లైట్ ట్రాప్ ఏర్పాటుచేయాలని తెలిపారు. అనంతరం ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఆయనవెంట కొమురవెల్లి వ్యవసాయాధికారి నరేశ్ ఉన్నారు.

కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశం

చేర్యాల, ఫిబ్రవరి 20 : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళ వారం చేర్యాల పట్టణంలో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల పార్టీ ముఖ్యకార్యకర్తలతో సమావేశమయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాలలో జనగామవాణి వినిపించినట్టు తెలిపారు.అనంతరం ఇటీవల రోడ్డుప్రమాదంలో గాయాలపాలైన చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన జర్నలిస్టు అనుముల నర్సిరెడ్డితో పాటు పట్టణానికి చెందిన మరో జర్నలిస్టు ఒరుగంటి శ్రీకాంత్‌ను పరామర్శించారు. ఆయనవెంట ఎంపీపీలు వుల్లంపల్లి కరుణాకర్, తలారి కీర్తన, కొమురవెల్లి జడ్పీటీసీ సిలివేరు సిద్దప్ప, నాయకులు ఉన్నారు.

మద్దతు ధరను ప్రభుత్వమే నిర్ణయించాలి

● **తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు**

సిద్దిపేట అగ్రికల్చర్, ఫిబ్రవరి 20: రైతు పండించిన పంట సాగు ఖర్చులకు మూడు రేట్లు ఉండే విధంగా కనీసం మద్దతు ధరను నిర్ణయించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉండాలని తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరిరావు పేర్కొన్నారు. మంగళవారం సిద్దిపేట రైతు బజార్ రైతులతో ఆయన సమావేశమై కేంద్ర ప్రభుత్వ పరిధిలోని రైతులు ఎదుర్కొంటున్న అన్ని ప్రధాన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. వారి మేనిఫెస్టో వుంచి రైతులకు భరోసా ఇచ్చిన పార్టీ అభ్యర్థులనే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలించుకొందామని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల బీమా ప్రీమియం మొత్తం కేంద్ర ప్రభుత్వం భరించాలన్నారు. సమావేశంలో తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మారెడ్డి రామాలింగ రెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రోటరీక్లబ్ సేవలు అభినందనీయం: గజ్వేల్ ఏసీపీ

ములుగు, ఫిబ్రవరి 20: రోటరీక్లబ్ సేవలు అభినందనీయమని గజ్వేల్ ఏసీపీ బాలాజీ పేర్కొన్నారు. మంగళవారం ములుగు మండలం లక్ష్మక్కపల్లి వీపీజే ఫంక్షన్‌హాల్‌లో రోటరీక్లబ్ అధ్యక్షుడు కుక్కల బాబుగౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ బాలాజీ మాట్లాడుతూ క్లబ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రంజిత్‌సింగ్, పీడీజీ రాజ్యలక్ష్మి, సెక్రటరీ నరసింహారెడ్డి, ట్రెజరర్ శ్రీనివాస్‌గౌడ్, వాటర్ శానిటైజేషన్ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదును పరిశీలించిన ఎన్నికల అధికారి

చేర్యాల, ఫిబ్రవరి 20: ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను మంగళవారం కొమురవెల్లి తహసీల్ కార్యాలయంలో ఎన్నికల అధికారి తిరుమలరావు పరిశీలించారు. ఓటరు నమోదుకు సంబంధించిన అంశాలపై తహసీల్దారు లక్ష్మినారాయణకు పలు సూచనలు చేశారు.

వృత్తి, వ్యాపార లైసెన్స్ తీసుకోవాలి

గజ్వేల్, ఫిబ్రవరి 20: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వృత్తి వ్యాపారులు లైసెన్స్ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వృత్తి వ్యాపారులు 2023-24కు సంబంధించిన వ్యాపార లైసెన్సులు ఏప్రిల్-2023 తీసుకోవల్సి ఉండగా కొందరు నేటికీ తీసుకోలేదన్నారు. మున్సిపల్ చట్టం-2019 చట్టం ప్రకారం లైసెన్సు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కాగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ సమావేశాన్ని ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ గోల్కొండ నర్సయ్య తెలిపారు.

'మహిళలు సమస్యలపై ఉద్యమించాలి'

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 20: సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) కేంద్ర కమిటీ సభ్యురాలు కె.ఆశాలత మహిళలకు పిలుపునిచ్చారు. మంగళవారం ఐద్వా జిల్లా విస్తృత సమావేశంలో పాల్గొని ఆమె మాట్లాడారు. పాలక వర్గాలు అనుసరిస్తున్న విధానాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఆత్తిని జాలిగపు శిరీష, శోభ, విఘ్నేశ్వరీ, నక్క పద్మ, దాసరి పద్మ, కనకవ్వ, రేవతి, భాగ్యలక్ష్మి, జయశ్రీ, ఉపేంద్ర, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఐకేపీ సిబ్బందికి అవగాహన

రాయపోల్, ఫిబ్రవరి 20: రాయపోల్ దౌల్తాబాద్ మండలాల ఐకేపీ ఏపీఎంలు, సీసీలకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో మధుసూదన్ పాల్గొని సూచనలు చేశారు. బ్యాంకు లింకేజీ లోకోస్ యాప్, పీఎంఎఫ్ఈ న్యూ ఎంటర్‌ప్రైజెస్, ఐకేపీకి సంబంధించిన అన్ని యాక్టివిటీలపై వివరించారు.

న్యాయమూర్తులను కలిసిన ఏసీపీ

గజ్వేల్, ఫిబ్రవరి 20: గజ్వేల్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన ఏ.బాలాజీ గజ్వేల్ న్యాయమూర్తులను మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సౌమ్య, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంకను కలిసి పూలమొక్కను అందజేశారు.

రేపు సిద్దిపేట జిల్లా పురుషుల సీనియర్ కబడ్డీ జట్టు ఎంపిక

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 20: 70వ తెలంగాణ రాష్ట్ర అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు పురుషుల సిద్దిపేట జిల్లా కబడ్డీ జట్టు ఎంపికను ఈ నెల 22న ఉదయం 10 గంటలకు సిద్దిపేట మిని స్టేడియం మైదానంలో నిర్వహించనున్నట్లు సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9550847409, 8885728286 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

23న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 20: సిద్దిపేట జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ నెల 23న ఉదయం 7.30 గంటలకు అండర్ 14, 16, 18, 20 విభాగంలో బాలబాలికలకు వేర్వేరుగా 400 మీటర్ల పరుగు పందెం ఎంపిక పోటీలుంటాయని సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు పరమేశ్వర్ తెలిపారు.

వయోజన విద్యను విస్తృతం చేయాలి

స్థాయీ సంఘాల సమావేశాల్లో జడ్పీ చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణశర్మ



జడ్పీ డిప్యూటీ సుమతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా స్థాయిసంఘ సభ్యులు

సిద్దిపేట అగ్రికల్చర్, ఫిబ్రవరి 20: పదో తరగతిలో మన జిల్లానే ప్రథమ స్థానంలో ఉండాలని, వయోజన విద్యను మరింత విస్తృతం చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణశర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం సిద్దిపేటలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణశర్మ అధ్యక్షతన గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయం, విద్యా- వైద్యం తదితర అంశాలపై స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ పంటల సాగు, మల్బరీ పంటల సాగుపై చొరవ తీసుకొని సాగు విస్తీర్ణం పెంచేలా కృషి చేయాలని ఆమె సూచించారు. మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా పెండింగ్లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. మేడారం సమ్మక్క సారక్క జాతరలకు వెళ్లే భక్తజనం పర్యావరణహితంగా జాతరను జరుపుకోవాలని ఆమె చెప్పారు. నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో పనిచేసే ఇన్‌స్టిట్యూట్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ అండ్ అడ్వకేసి ఆధ్వర్యంలో తయారుచేసిన పర్యావరణహిత మేడారం జాతర పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో చనిపోయిన జడ్పీ డిప్యూటీ సుమతి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ యాదవ రెడి, జడ్పీ సీఈవో రమేష్, జిల్లా స్థాయీ సంఘ సభ్యులు, ఉన్నత అధికారులు, జడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి, జడ్పీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటాలి

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 20: క్రీడల్లో సత్తా చాటి, సిద్దిపేటకు పేరు తీసుకరావాలని సిద్దిపేట జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ సూచించారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలో ఇటీవల హైదరాబాద్‌లోని బీహెచ్‌ఈఎల్‌లో జరిగిన థర్డ్‌ఫేస్ ఖేలో ఇండియా ఫస్ట్ తైక్వాండో సెలక్షన్ లీగ్‌లో సిద్దిపేట జిల్లా తైక్వాండో అసోసియేషన్ విద్యార్థి, సిద్దిపేట పట్టణానికి చెందిన కంతుల పూజ జూనియర్ విభాగంలో అండర్ 42 కేజీల విభాగంలో విజయం సాధించింది. ఈ మేరకు సిద్దిపేట జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ విద్యార్థిని అభినందించి సన్మానించారు. ఈ నెల 27 నుంచి పాండిచ్చేరిలో జరిగే తైక్వాండో పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వేలేటి రాధాకృష్ణశర్మ, ఉపాధ్యక్షుడు డాక్టర్ రామ్మోహన్, కంతుల రమేష్, కార్యదర్శి రాచకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పొద్దుతిరుగుడు సాగుతో అధిక లాభాలు

సిద్దిపేటరూరల్/చిన్నకోడూరు/తొగుట, ఫిబ్రవరి 20: వ్యవసాయ పరిశోధనాస్థానం తోర్నాలలో మంగళవారం పొద్దుతిరుగుడు పంటలో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకుడు డా. పి. రఘురాం రెడ్డి మాట్లాడుతూ పొద్దుతిరుగుడు పంట ప్రాముఖ్యత ను వివరించారు. భూమిలో సేంద్రియ కార్బన్ శాతం పెరగడానికి మల్టీక్రాప్, నూతన యాజమాన్య పద్ధతుల గురించి తెలియజేశారు. తోర్నాల వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా. ఎస్. శ్రీదేవి మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో పొద్దుతిరుగుడు సాగు విస్తీర్ణాన్ని పెంచడంలో శాస్త్రవేత్తలు చేస్తున్న కృషిని వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి కె.శివప్రసాద్ మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో యాసంగిలో 8700 ఎకరాల్లో ప్రొద్దుతిరుగుడు పంటను సాగు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.ఇ. ఉమారాణి, డి. శ్వేత, ఎ. సరిత, డా. టీ. శ్రీజయ, ఏ. రమాదేవి, రైతులు పాల్గొన్నారు. అనంతరం సిద్దిపేట మండలంలోని బుస్సాపూర్, చిన్నకోడూరు మండలంలోని చిన్నకోడూరు, మెట్టుపల్లి గ్రామాలతో పాటు తొగుట మండలం ఘనపూర్ గ్రామంలో పొద్దుతిరుగుడు పంటను వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. పంట విస్తీర్ణం తగ్గడానికి గల కారణాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. పంట దిగుబడి పెరిగేందుకు రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.



చిన్నకోడూరు: మెట్టుపల్లిలో పొద్దుతిరుగుడు పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

బాలికల చట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి

● **హుస్నాబాద్ సీఐ ఎర్రల కిరణ్**

హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 20: బాలికల చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని హుస్నాబాద్ సీఐ ఎర్రల కిరణ్ పేర్కొన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లోని సీవీ రామన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో బాలికల చట్టాలు, మహిళా చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కిరణ్ మాట్లాడుతూ బాలికల రక్షణ కోసం షీటీంలను ఏర్పాటు చేశామన్నారు. బాల్యవివాహాలతో దుష్పరిణామాలు, సైబర్‌నేరాలు, గుడ్‌టచ్ బ్యాడ్ టచ్, ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా అనర్థాలు తదితర అంశాలపై సీఐ వగాహన కల్పించారు. పాఠశాల కరస్పాండెంట్ కాయితనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డివిజన్ షీటీం బృందం సైదయ్య, హెడ్ కానిస్టేబుల్, మహిళా కానిస్టేబుల్స్ స్వప్న,ప్రశాంతి, కృష్ణ, శ్రవణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

● **దుబ్బాక:** విద్యార్థులు సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని దుబ్బాక సీఐ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం దుబ్బాక మండలం తిమ్మాపూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు పెంటయ్య, షీటీం కానిస్టేబుళ్లు తదితరులున్నారు.

● **తొగుట:** ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని ఎస్‌ఐ లింగం సూచించారు. మంగళవారం తొగుట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తెలుగు టీచర్ అనురాధ పోలీసుల విధులపై కవిత రాసి అద్భుతంగా పాడటంతో ఎస్‌ఐ లింగం ఉపాధ్యాయురాలిని అభినందించారు.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వాహనాల పట్టివేత

జిల్లాలోని పలు మండలాల్లో ఇసుక అక్రమ రవాణా, డంపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఈ సందర్భంగా ఇసుక డంపులతో పాటు అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న వాహనాలను సీజ్ చేశారు.

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 20: సిద్దిపేట పట్టణంలోని కప్పలకుంట్ల వడ్డెర కాలనీ వద్ద కొమిరి కళ్యాణ్ అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్‌తో ఇసుక డంపు చేస్తుండగా సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. అనంతరం ట్రాక్టర్‌ను వన్ టౌన్ పోలీసులకు అప్పగించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

● **మద్దూర:** ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని మద్దూరు పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల19న అర్ధరాత్రి ఏఎస్‌ఐ జగదీశ్వర్ పెట్రోలింగ్‌లో భాగంగా రాంపూర్ గ్రామ క్రాసింగ్ వద్ద లారీని ఆపి పరిశీలించగా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్టు తేలిందన్నారు. దీంతో అక్కన్నపేట మండలం గుడాటిపల్లి గ్రామానికి చెందిన అజ్మీరా మోహన్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

● **నంగునూరు:** మండలంలోని అక్కెనపల్లి పెద్ద వాగు నుంచి అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను మంగళవారం టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకుని రాజగోపాల్‌పేట పోలీసులకు అప్పగించినట్లు ఎస్‌ఐ భాస్కర్ రెడ్డి తెలిపారు. అదుపులోకి తీసుకున్న మూడు వాహనాల్లో రెండు ట్రాక్టర్లకు వేబిల్ లేవు. మరో ట్రాక్టర్‌కు అనుమతులు లేవు. ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌లో అప్పగించగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

● **కొండపాక:** మండలంలోని పలు గ్రామాల్లో అక్రమ మట్టి దందాపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మంగళవారం రెవెన్యూ అధికారులు అక్రమంగా తరలిస్తున్న మట్టి టిప్పర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. అక్రమంగా మట్టిని, ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని ఆర్‌ఐ బాలకృష్ణ హెచ్చరించారు.

బెక్కల్ హుండీ ఆదాయం రూ.2 లక్షలకు పైనే..

మద్దూరు, ఫిబ్రవరి 20 : దూళిమిట్ట మండలంలోని బెక్కల్ గ్రామంలో మంగళవారం శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం హుండీ లెక్కింపు చేపట్టారు. మార్చి 2, 2023 నుంచి ఈ నెల 20వ తేదీ వరకు భక్తులు హుండీల్లో వేసిన కానుకల్ని దేవాదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించగా రూ.2,01,367ల ఆదాయం సమకూరినట్టు దేవస్థాన కార్యనిర్వాహణాధికారి పీవీ శర్మ తెలిపారు.

ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీ



చిన్నకోడూరులో సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహిస్తున్న అధికారులు

చిన్నకోడూరు, ఫిబ్రవరి 20: చిన్నకోడూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం 14వ విడత జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులపై అధికారులు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో రూ. 4కోట్ల 90 లక్షల వ్యయంతో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు చేపట్టిన 861 రకాల పనుల వివరాలను తనిఖీ బృందం ప్రజావేదికలో వెల్లడించింది. రికవరీ, జరిమానా కలిపి మొత్తంగా రూ.69 వేల 501 విధించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో బాలకిషన్, ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఏపీడీలు శివాజీ. సతీష్, అంబుడ్స్‌మెన్ హరీఫ్, డీపీవో ప్రభాకర్, జెక్యూసీవో సంతోష్ రెడ్డి, ఎస్‌ఆర్‌పీ రంజిత్, డీఆర్‌పీఎస్‌లు, పీఎస్ఏఎస్‌లు, ఎంపీడీవోలు జనార్దన్, శ్రీనివాస్, ఉపాధి హామీ ఇంచార్జి ఏపీవో శివకుమార్, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి: గజ్వేల్ ఏసీపీ

గజ్వేల్/గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 20: పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని గజ్వేల్ ఏసీపీ ఏ.బాలాజీ సూచించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని తన కార్యాలయంలో పెండింగ్ ఉన్న కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్ ఉన్న కేసుల గురించి సంబంధిత ఎస్‌ఐ, సీఐలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ బాలాజీ మాట్లాడుతూ పారదర్శకంగా కేసుల దర్యాప్తు ఉండాలని, ప్రతీ కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని సూచించారు. ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ, మహిళలకు సంబంధించిన కేసులలో 60 రోజులలో చార్జిషీట్ దాఖలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో గజ్వేల్ ఇన్స్‌పెక్టర్ బి.సైదా, తొగుట సీఐ ఎస్‌కే లతీఫ్, తొగుట ఎస్‌ఐ లింగం, బేగంపేట ఎస్‌ఐ రవికాంత్‌రావు, ములుగు ఎస్‌ఐ విజయ్, ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ టెస్టులో రాష్ట్రస్థాయికి ముగ్గురు

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 20: పట్టణంలోని టీటీసీ భవన్‌లో మంగళవారం జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జిల్లా సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. సైన్స్ టాలెంట్ టెస్టులో రాష్ట్రస్థాయికి ఎన్నికైన వారిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఇరుకోడు టీఎస్ఎంఎస్ చెందిన విద్యార్థి ఆర్.సూర్య తేజను, ద్వితీయ స్థానంలో నిలిచిన పాములపర్తి జడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థి బి.నాగచైతన్య రెడ్డిను, తృతీయ స్థానంలో నిలిచిన నారాయణరావుపేట ఎంజేపీ విద్యార్థి ఆర్.శ్రీనివాస్‌రెడ్డిలకు ప్రశంసా పత్రం, మేమంటోతో అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి పయ్యావుల రామస్వామి, భౌతిక శాస్త్ర ఫోరం కన్వీనర్లు సాదత్ అలీ, నరసింహారెడ్డి, భగవాన్ జీవశాస్త్ర ఫోరం కన్వీనర్లు నాగరాజు, అనిల్ కుమార్, భౌతిక శాస్త్ర, జీవశాస్త్ర ఉపాధ్యాయులు, రాజమౌళి సురేందర్ రెడ్డి, చిన్న బ్రహ్మయ్య, వెంకటనారాయణ, రవీందర్‌రెడ్డి విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి: ఎంపీపీ

దుబ్బాక, ఫిబ్రవరి 20: గ్రామాల అభివృద్ధికి అధికారులు నిబద్ధతతో పని చేయాలని దుబ్బాక ఎంపీపీ పుష్పలత సూచించారు. మంగళవారం దుబ్బాక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్యసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామాల్లో పెండింగ్ పనులకు పూర్తిచేయాలన్నారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి కొరతలేకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు రవి, ఎంపీడీవో ఉమాదేవి, తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు, వివిధశాఖల అధికారులు తదితరులున్నారు.

దేశానికి ఇందిరమ్మ సేవలు మరువలేనివి



మిరుదొడ్డిలో ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

మిరుదొడ్డి, ఫిబ్రవరి 20: దేశానికి గతంలో ప్రధానిగా పనిచేసిన దివంగత ఇందిరా గాంధీ సేవలు మరువలేనివని కాంగ్రెస్‌పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మిరుదొడ్డిలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహాన్ని కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యా స్థాపన కోసమే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. ఆరు గ్యారంటీల్లో రెండు గ్యారంటీలను అమలు చేయడం జరిగిందన్నారు. గ్రామాల్లో ఎమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యకర్తలకు అండగా కాంగ్రెస్‌పార్టీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మిరుదొడ్డి మండల అధ్యక్షుడు రాజేశం, మహిళ అధ్యక్షురాలు లక్ష్మీ, నాయకులు భూపాల్‌గౌడ్, భూమాగౌడ్, కిష్టయ్య, శ్రీనివాస్, కుమార్, సుదర్శన్, స్వామి, శ్రీనివాస్, కొంగరి రవి, జహంగీర్, ఎదుల్ తదితరులున్నారు.